రాకాసి చేప

నీలా

"సిగరెట్ పెట్టి లా విసురు" అన్నాడు రాజు.

మూడయిదుల పెట్టెను ఆ వైపుకు విసిరేడు ఆనంద్.

ఆ రోజు ఆదివారం. ఏదో ఒక ప్రోగ్రాం ఫిక్సు చేసుకోవటానికి మొత్తం నలుగురు మిత్రులు అక్కడ సమావేశమయ్యారు. ఆ గది కృష్ణది. వారంతా పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్నారు. అందరూ ఆర్థికంగా మంచి స్థితిలో వున్నవారే. నారాయణ అంతకుముందే బయట కెళ్ళాడు.

రాజు సిగరెట్ వెలిగించాడు.

"రాత్రి జాస్ చూశాను" అన్నాడు పొగ వదుల్తూ.

"పాతదేగా" అన్నాడు ఆనంద్.

"కేవలం టెక్నిక్ కోసం చూడాలంతే" అన్నాడు రాజు.

"అవును. "జాస్" నిర్మాణం వాళ్ళకి మాత్రమే చేతయింది. మనవాళ్ళయితే ఎంత ఆర్టిఫిషియల్ గా

చేస్తారో. విఠలాచార్య సినిమాల్లో దెయ్యాల్లా" ఆనంద్ అన్నాడు.

"కానీ స్టోరీ లేదు."

"సాహసాలకు పెద్ద కథేం అవసరంలేదు. ఎలా చిత్రీకరించారు నేదే ప్రధానం. జాన్ గాని, ఈ రోజు వస్తున్న హారర్ సినిమాలుగాని వీటికి కథతో సంబంధం లేదు" అన్నాడు ఆనంద్.

"కానీ ఒకందుకు వీళ్ళని అభినందించాలి. హ్యూమన్ సైకిలాజికల్ ఫీలింగ్స్‌ను గొప్పగా రికార్డ్ చేస్తారు. ముఖ్యంగా యింకో క్షణంలో మృత్యువు ఎదురవుతుందని తెలిసినప్పుడు, అనుకోని ప్రమాదాల్లో చిక్కుకొన్నప్పుడు మనుషుల ప్రవర్తన, కంగారు, ప్రాణభీతి.... ఓహ్ ఫంటాస్టిక్‌గా చిత్రీకరిస్తారు" తిరిగి ఆనంద్ వివరించాడు.

ఆనంద్ ఎక్కువగా ఇగ్లీ సినిమాలు చూస్తుంటాడు. మార్షల్ ఆర్ట్స్‌కు చెందిన సినిమాల నుండి, అడ్వెంచర్స్, జేమ్స్‌బాండ్ చిత్రాలూ ఇంకా కౌబాయ్ చిత్రాలవరకూ. భారతదేశానికి దిగుమతి అయ్యే చిత్రాల్లో సెక్స్, వయలెన్స్, క్రైమ్‌కు చెందినవే ఎక్కువగా వుంటాయి. ఫిలసాఫికల్ టచ్ వున్నవి బహు అరుదుగా వస్తుంటాయి.

"ఏమోరా అర్థమయి చావవు" అన్నాడు రాజా.

"నాకు మట్టుకు అర్థమవుతాయా? వాళ్ళ ఏక్సెంట్ వేరు. మనది వేరు. కేవలం టెక్నిక్ కోసం చూడాలంటే. పిటీ ఏమిటో తెలుసా? నేను చూస్తున్న సినిమాల్లోని దృశ్యాలన్నీ డైరెక్టుగా తెలుగు సినిమాల్లోకి వచ్చేస్తున్నాయి."

"అది సహజమేననుకో" అన్నాడు రాజా.

"ఏమిటి సహజం. మన ప్రముఖ దర్శకులంతా కొంతా యిలా కొత్త ఇంగ్లీష్ సినిమా వస్తే చాలు వెంటనే వీడియోలు వేసుకు చూడటం మొత్తం కథనే వాడు కుంటే బాగుంటుందా. లేక కొన్ని బిట్లు చేరిస్తే చాలా అనే చర్చలు. ఫస్ట్‌బ్లడ్ సినిమాను మనవాళ్ళు ఎప్పుడో తీశారు. ఒక్కసారి ఇద్దరికి ఒకే సినిమా నచ్చుతుంది. ఇక అది తియ్యటానికి పోటీలు" అన్నాడు ఆనంద్.

"నువ్వు సినిమాల గురించి చెబుతున్నావు. తెలుగులో వస్తున్న అనేక నవలల్ని డైరెక్టుగా ఇంగ్లీష్ నుండి దించేస్తున్నారట" అన్నాడు రాజా.

"ఓరేయ్" అంటూ హుషారుగా లోనికొచ్చాడు నారాయణ.

"ఏమిట్రా ఏదన్నా విశేషం వుందా" అన్నారంతా.

"అవును. మనం యిప్పుడు "జాస్" చూడబోతున్నాం"

"రాత్రే చూశాంలే."

"వాడు జాస్ ఒన్ కాక టూ గురించి మాట్లాడుతున్నాడేమో."

"కాదు. జాస్‌లో మనం చూశామే అలాంటి రాకాసి చేపను చూడాలంటే వెంటనే బయలుదేరండి" అన్నాడు నారాయణ.

"సరిగ్గా చెప్పరా."

"ఇక్కడకు సరిగ్గా ముప్పై కిలోమీటర్ల దూరంలో ఓ గ్రామం వుంది. ఆ సముద్రతీరంలో ఇప్పుడు పెద్ద తిమింగలం పడుంది."

"ఎవరు చెప్పారు?"

"ఇప్పుడే ఎవరో అనుకుంటుంటే విన్నాను."

"ఎన్ని రోజులయిందో పడి."

"నిన్నట."

"దాన్ని వేటాడేరా" అన్నాడు ఆనంద్ సాలోచనగా.

"ఏమో మరి."

"వేటాడమా, మన వలలూ, పడవలు ఎందుకన్నా పనికొస్తాయా?"

"మరెలా వచ్చింది. చచ్చి ఒడ్డుకు కొట్టుకొచ్చిందంటావా?"

"అలానే కావచ్చు. లేకుంటే అలలతోబాటు ఒడ్డుకు కొట్టుకుని వచ్చుంటుంది. ఆ తర్వాత అక్కడ నుండి లోపలకు వెళ్ళటం సాధ్యమైవుండదు."

"తిమింగలాల వేట సాధ్యం కాదంటావా?" అన్నాడు రాజు.

"ఏమో ఆ విషయం తెలియదుగాని అవి కొన్ని ప్రాంతాల్లోనే సంచరిస్తుంటాయట. సృష్టిలో అన్నిటి కన్నా పెద్ద జలచరం. అదీ చేపేనంటారు కొంతమంది. వీటి దెబ్బకు మహానౌకలే తల్లక్రిందులవుతుంటాయట" అన్నాడు ఆనంద్.

"కానీ వెనకటి కాలంలో ఓ ముసలాయన ఏ వలలూ లేకుండా తిమింగలాన్ని వేటాడిన కథ మీకు తెలుసా?" అన్నాడు కృష్ణ....

"అబ్బే.... తెలియదు" అన్నారు మగ్గురూ.

"భలే ఇంట్రెస్టింగ్ గా వుంటుంది. ఆఫ్ కోర్స్ నేను విని కూడా చాలా కాలమయింది. సరిగ్గా గుర్తులేదుగాని

మొ త్తంమీద చెప్పగలను."

"చెప్పరా" అన్నారు ఆసక్తిగా.

2

ఆ గూడెంలో కిష్టయ్య వృద్ధ జాలరి. అతను బాగా ముసలివాడయిపోయాడు. కంటిచూపు కూడా దెబ్బ తింది. దగ్గరగా వున్న వస్తువుల్ని పరీక్షమీద చూడ గలడు. దూరాన వున్న వస్తువు పూర్తిగా కనిపించవు.

అతనికి మొత్తం నలుగురు కొడుకులు. వారి ప్రధాన వ్యాపకం కూడా చేపల వేటే. వారందరికి పెళ్ళిళ్ళు జరిగినా, పిల్లలు పుట్టినా కలిసే వుంటున్నారు.

తాను బ్రతికున్నంతవరకూ వారంతా కలిసుండా లనేది ముసలాయన కోర్కె. అతను బాగా హుషారుగా ఉన్నప్పుడు తన యవ్వనంలోని సముద్ర అనుభవాల్ని పిల్లలకు చెబుతూం దేవారు.

కిష్టయ్య కొడుకులు వేటలో నిపుణులే. అయినా వారి వేట పద్ధతులు ముసలాయనను తృప్తిపరిచేవి కావు. వారు వేటాడే ప్రాంతంలో ఎప్పుడు సొర చేపలు పడు తుం దేవి. అవి దాదాపు ఇరవై అడుగుల నుండి నలభై అడుగుల దాకా వుంటుం దేవి.

అయితే అలాంటి పెద్ద వేటను ముసలాయన పిల్లలు ఎప్పుడూ సాధించలేరు. ముసలాయన జీవితంలో అతను బాగా చిన్నప్పుడు మాత్రమే ఆ విషయం విన్నాడు. అయినా తను కూడా ఓ మోస్తరు రాకాసి చేపల్ని వేటాడాడు.

ఓ రోజు మాటల సందర్భంగా సొరచేపల సంగతి వచ్చింది. కిష్టయ్యకు ఎందుకో అలాంటి చేపను వేటాడా లనే కోర్కె కలిగింది. ఆ విషయం తన బిడ్డలకు

చెప్పాడు.

చాలా సంవత్సరాల తర్వాత తిరిగి అతను సముద్రం లోకి అడుగు పెడుతున్నాడు. కొడుకులకు యేమేం చేయాలో పురమాయించాడు. రోజూ సాయంకాలం సముద్రం వొడ్డుకెళ్ళి ఆ అలల్ని గమనిస్తూ హోరును వింటూండేవాడు.

రెండు మూడు రోజుల్లో పడవ సిద్ధమయింది. బలమయిన తెడ్లు...పడవ నడుమ ఓ పొయ్యి లాంటిది ఏర్పాటు చేశారు. అందులో నుండి భగ భగ మంటూ మండుతుంది మంట నాల్కలు చాస్తూ.

పిల్లలందరికీ తమ తండ్రిపట్ల గౌరవం వుంది. వారికీ అనుభవం కొత్త కాబట్టి అందరూ ఉత్సాహంగానే ఉన్నారు. కానీ వారికి కొన్ని సందేహాలు పైతం ఉన్నాయి. ఈ పడవలో ఇలా వెళ్ళి ఎలా ఓ రాక్షసి చేపను వేటాడుతాడో వారికి అర్థం కావటం లేదు.

ముసలాయన మాత్రం గంభీరంగా వున్నాడు. ఏమీ మాట్లాడటం లేదు. అవసరమయినప్పుడు మాత్రం సూచనలిస్తున్నాడు.

పడవ బయలుదేరింది. వొడ్డున పిల్లలూ, ఆడవాళ్ళూ, అంతా నిలబడి వీడ్కోలు చెప్పారు. గూడెంలో అందరికీ ఈ విషయం ఓ వింతగా వుంది.

పడవలో అయిదుగురున్నారు. మధ్యన మంట. సముద్రంలోకి వారు వెళ్తున్నకొలదీ ఆ దృశ్యం చాలా బాగుంది. క్రమంగా వారు లోపలకి వెళ్ళిపోయారు. దూరంగా ఎర్రగా మెరుపు మాత్రం కనిపిస్తోంది.

"సూడం డబ్బాయిలు. మంట వెలుగు తగ్గకూడదు. నావ కండ్లగపడవు. తలో దిక్కున సూడండి. దూరంగా

యే పక్కనన్నా మెరుపు అగపత్తే చెప్పండి" అన్నాడు ముసలాయన.

నలుగురి కండలూ, పిక్కలూ కూడా బలంగా వున్నాయి. వారంతా నల్లగా వున్నారు. వారి శరీరాలు మెరుస్తున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. నాలుగు దిక్కులూ నలుగురూ చూస్తోన్నారు. ముసలాయన మాత్రం చాలా తాపీగా కూర్చున్నాడు.

పడవ బాగా లోపలకు వెళ్ళిపోయింది. వారికి తీరం కనిపించటం మానేసి చాలా సేపయింది. పడవలో నిప్పు నిరంతరం వెలుగుతోంది ఎర్రగా!

వాళ్ళకి విసుగు ప్రారంభమయింది. సొరచేప దొరుకుతుందేమోనన్న ఆశ కలగటంలేదు. తండ్రిమీదున్న గౌరవంతో మరేం మాట్లాడలేకపోతున్నారు.

"సక్కంగా సూడండి. ఏ మూల యేం లేదా అగుపడ్డా చెప్పండి" అన్నాడు తిరిగి.

"సూత్తానే వున్నాం" అన్నారు.

దూరంగా అలల తాలూకూ తెల్లదనం కనిపిస్తోంది. ఆ విషయమే చెప్పాడు ఓ కొడుకు.

"అట్టాకాదు. కళ్ళు చెదిరే మెరుపు."

పడవ వెళ్తోంది.

ఒక్కొక్కరి ముఖంలో విసుగు.

వారు గాలి పీల్చి వదులుతున్న ధ్వనినిబట్టి ముసలాయన వారి పరిస్థితి అర్థం చేసుకున్నాడు.

"ఎనకటి మడుసులు వేరు, ఓపిక ఏడుంటాది మీకు" గొణుక్కున్నాడు.

ఎర్రగా మంట.

"ఓపికుండాల....పక్కి వేటకు కాదు వొచ్చింది"

అన్నాడు ముసలాయన.

ఆ మాటతో తిరిగి అందరిలోనూ ఓ రకమైన ఉత్సాహం ప్రవేశించింది. కళ్ళు చిట్లించుకొని చూడటం ప్రారంభించారు.

అప్పుడు కనిపించింది దూరంగా కళ్ళు మిరిమిట్లు గొలిపే ఓ వెలుగు!

"అయ్యో! అగపడింది" అరిచేడో కొడుకు.

"తెడ్లెయ్యండి. ఎనక్కి తిప్పండి పడవని...." ముసలాయన ఉద్వేగంతో అరిచాడు.

సముద్రం ఒక్కసారిగా కంపించినట్లయింది.

నలుగురూ తెడ్లు అందుకొన్నారు. ఆ మెరుపు వారిలో గుబులు రేపింది.

"బేగెయ్యండి. అదే .. ఒడ్డుకు సేరకుంటే పడవతో సహా మింగేసుద్ది" అన్నాడు ముసలాయన.

వారి కళ్ళల్లో మృత్యుభయం.

శక్తులన్నింటిని ధారపోసి తెడ్లు వేస్తున్నారు.

వారి అదృష్టం గాలి వాలుగా వుంది.

సముద్రమంతా అల్లకల్లోలంగా వుంది.

మృత్యువు అమాంతం కబళిస్తున్నట్లుగా....

గంటకు రెండువందల ఏభై కిలోమీటర్ల వేగంతో తుఫాను వీస్తున్నట్లుగా....దూరంగా ఒడ్డు....

ఓ పెద్ద రాక్షస అల దూరంగా....

వాటికి ప్రాణాలమీద ఆశలు పోయాయి.

ముసలాయన మాత్రం తొణకటంలేదు.

ఒక్కసారిగా రాక్షసి అల మూసుకొచ్చింది.

ఆ విసురుకు పడవ గాల్లో తేలుతూ ఒడ్డున పడింది.

ముసలాయనా....నలుగురూ తలో మూలకు విసిరివేయ

బడ్డారు.

కళ్ళు గుమ్ము కొట్టుకుపోగా బలవంతంగా తెరిచి.... నోట్లోకి వెళ్ళిన ఇసుకను ఊస్తుంటే వారి కళ్ళకు కనపడు తోంది—ఓ చిన్న కొండంత రాకాసి చేప!

3

"ఇది కథా నిజంగా జరిగిందా?"

"ఏమో తర తరాలుగా చెప్పుకునే కథల్లో ఏదోకటి. ఆ నిప్పును చూసి ఆ జీవో తినే వస్తువుగా భ్రమించి దాన్ని మింగేయాలని భావించి వేగంగా ముసుకొచ్చింది. ఆ వేగంతో నే వొడ్డున పడింది. తిరిగి నీటిలోనికి వెళ్ళటం అసాధ్యం కదా....ఆ తర్వాత ఏడు ఊర్ల వారు దాన్ని నరుక్కుపోయారనే విషయం ప్రక్కన పెడితే దాని కన్నులోనే ఓ ద్వారం చేశారట. అంటే అదెంత పెద్దదో ఊహించుకోవచ్చు. కావాలంటే ఆ ద్వారం మచిలీపట్టణంలో యిప్పటికీ వుందట ఓసారి వెళ్ళి చూసి రావచ్చు" అన్నాడు కృష్ణ.

"ఫాంటసీ" అన్నాడు నారాయణ.

"ఫాంటసీ యేముంది? విచక్షణా రహితంగా తిమింగలాల్ని ఈ నాడు వేటాడుతున్నారు. అవి కూడా కాల గర్భంలో కలసిపోతున్నాయి. తిమింగలాల సంతతి అంతరించిపోతుందేమోనన్న భయం వ్యక్తం చేసిన ఆర్టికల్ ఒకటి నేను చదివాను. సముద్రం గొప్ప అద్భుతం. అందులో నుండే మానవ జీవితావసరాలు మూడువంతులు తీరుతున్నాయి. ఆహారం కోసమే కాదు మనం వినియోగించే అనేక వస్తువుల్ని సముద్రంనుండే పొందుతున్నాం" అన్నాడు కృష్ణ.

"ఆ ముసలాడి తెలివి అమోఘం."

"అవును. వెనుకటి మనుషులు. వారిని తక్కువగా అంచనా వేయకూడదు."

"సో....మనం వెంటనే బయలుదేరుదాం. ఆ రాక్షసి చేపను మనం చూడాలి. ఇలాంటి అవకాశాన్ని మిస్ చేసుకోకూడదు" అన్నాడు రాజు.

"మనతో పాటు కెమెరా తీసుకెళ్దాం. ఇలాంటి అరుదైన దృశ్యాలు కూడా లభించవు. మంచి ఫోటోలు తీసుకోవచ్చు" అన్నాడు ఆనంద్.

"కృష్ణదగ్గర కెమెరా వుందిగా!"

"ఉంది. కానీ రీల్ లేదు."

"అయితే నేను వెళ్ళి తెస్తాను" అన్నాడు నారాయణ.

"కలర్ రీల్ తీసుకురా. పదరా."

"ఆ---గ్."

"ఎలా వెళ్దాం?"

"ఎలా ఏముంది? రెండు స్కూటర్లయితే చాలు. మన యిష్టం వచ్చినప్పుడు బయలుదేరి రావచ్చు. బస్సులున్నాయో....చచ్చాయో....ఉన్నా అక్కడ ఆపుతాడో....లేడో తెలియదుగా" అన్నాడు కృష్ణ.

"అలాగే చేద్దాం" అన్నారు.

"ముందు పెట్రోల్ వుందేమో చూసుకోవాలి. టాంక్ ఫుల్ చేయించుకోవటం అవసరం."

"వాది నిన్ననే ఫుల్ గా కొట్టించాను" అన్నాడు రాజు.

"సో....ఆనంద్ కీ స్కూటర్లో పెట్రోలు నింపి.... తర్వాత మనకు తిండానికి అక్కడేం దొరకవు. అందు లోనూ సముద్రపు గాలికి విపరీతంగా ఆకలి వేస్తుంది.

అందుకని యేమన్నా తీసుకుపోవాలి. నారాయణా! బిస్కట్స్, ఇంకా కారాసుకుకు, కూల్ డ్రింక్స్ పాకలూ వగైరాలన్నీ నువ్వే చూడాలి."

"రెండురోజు లుందామంటావా?" అన్నాడు నారాయణ.

"రెండురోజులు కాదు. అక్కడ ఆకలయితే ఆ రాక్షసి చేపను తింటానంటూ బయలుదేరతావ్."

"ఓ.కె. నేను వెళ్తాను" అన్నాడు.

"త్వరగా రా!" అన్నాడు.

నారాయణ్ తో పాటు ఆనంద్ కూడా వెళ్ళి పోయాడు.

సరిగ్గా గంట తర్వాత రెండు స్కూటర్లు రాకాసి చేప పడున్న చోటుకు పరుగుతీస్తున్నాయి.

4

కృష్ణ మంచి ఫోటోగ్రాఫర్. అతనికి ఆ అభిరుచి కలిగాక రెండు మూడు రీళ్ళు మాత్రం చెడగొట్టాడు. అప్పటికి అతనికి అందులోని మెళకువలు కొంతవరకు తెలిసాయి. అప్పట్నుండి అతను చూస్తున్న సమాజంలో ఏమాత్రం విశేషంగా కనిపించే అంశాన్నైనా కెమెరాలో బంధిస్తున్నాడు.

అంతా స్కూటర్ల మీద అక్కడకు చేరారు. జనం పల్చగానే ఉన్నారు. ఇంకా ఈ వార్త బాగా తెలిసి వుండదు. పేపర్లోనన్నా పడితేగాని దానికి యెక్కువ ప్రచారం లభించదు.

సముద్రం ఇవతల కొండరాళ్ళ పడున్నట్లుగా వుందా చేప. జీవితంలో ప్రత్యక్షంగా అంత చేపను చూడటంతో వారికి ఒక్కసారిగా సంతోషం, ఆశ్చర్యం లాంటి

భావాలు ఏకకాలంలో కలిగాయి.

"కృష్ణా! కెమెరాలో యిది పడుతుందా? లాంగ్ షాట్ లో తీస్తే అంత క్లారిటీ రాదేమో" అన్నాడు ఆనంద్.

"డోంట్ వర్రీ భాయ్. నేను జూమ్ లెన్స్ తీసుకొచ్చాను" అంటూ కెమెరాకు జూమ్ లెన్స్ తగిలించాడు.

సరైన ఏంగిల్ చూసుకొని ఆ తిమింగలం ఫోటో తీశాడు. అప్పుడు జనమంతా వారిదగ్గరకు చేరటం ప్రారంభించారు.

మిత్రులందరూ కలిసి, విడివిడిగా దాని కొంతన నిల బడితే కృష్ణ ఫోటోలు తీశాడు. అంతా సరిచేసి కృష్ణ వెళ్ళి నిలబడితే ఆనంద్ క్లిక్ చేశాడు.

చూడటాని కొచ్చిన కొద్దిపాటి జనం తప్పితే పల్లె కార్లు యెవరూ కనపడటంలేదు. ఈ వార్త యింకా ప్రభుత్వాధికారులకు అందిందో లేదో....ఓ వేళ అందినా వారు నిద్ర నుండి మేల్కొవాలి కదా.

"మనం గవ్వలు యేరుకుందాం" అన్నాడు రాజా.

"పదండి" అన్నాడు కృష్ణ మెడలో కెమెరా వేసుకొని.

సముద్రతీరం వెంట ఒక్కసారిగా పరుగుతీశాడు రాజా.

"స్కూటర్స్ ఇక్కడే వుంచుదామా?"

"లాక్ చెయ్యండి" అన్నాడు కృష్ణ.

దూరంగా కొన్ని గుడిసెలు కనిపిస్తున్నాయి జూమ్ లెన్స్ లో నుండి అక్కడ ఆరేసిన వలలు సైతం కన్పించాయి.

"కమాన్!" అంటూ పరిగెత్తారు ఆనంద్, నారాయణ.

కృష్ణ నవ్వుతూ అనుసరించాడు.

"నారాయణా! ఎవరి పాకెట్ వారే తెచ్చుకోవాలి" అన్నాడు ఆనంద్.

రాజుకు రెండు ముత్యపుచిప్పలు కనిపించాయి. ఆ మాత్రానికే వాటిని చూపి ఎగిరి గంతేశాడు.

"ఒరేయ్....ముత్యం దొరికినంత సంబరపడిపోతున్నావు. అలాంటివి ఈ తీరం పొడుగునా దొరుకుతుంటాయి" అన్నాడు ఆనంద్.

"అవునూ....ముత్యం అంటుంటారు అవెలా వుంటాయి? నేను చూడలేదు" అన్నాడు రాజు.

"తెల్లగా మెరుస్తుంటాయి. ఈ ముత్యపుచిప్పల్లో వానచినుకు పడితే అదే ముత్యంగా మారుతుంది" అన్నాడు ఆనంద్.

"నువ్వు వీటిని తీసిపారేస్తున్నావుగానీ మద్రాసులో అయితే చిన్న పగిలిన పెంకు కూడా దొరకదు. వీటితో ఎంతో అందమైన బొమ్మలు తయారుచేస్తారు. వాటి ధర సామాన్యంగా వుండదు."

"నిజమే మనవాళ్ళింకా ఆ టెక్నిక్ నేర్చుకోలేదు. పైగా అదేమో బీచ్. రోజూ వేలాదిమంది వస్తుంటారు. ఇక్కడ కవరేస్తారు" అన్నాడు ఆనంద్.

"జాగ్రత్తగా చూడరా. సముద్రం ఏదీ దాచుకోదు. అన్నింటిని బయట పారేస్తుంది. బంగారం దొరికినా దొరుకుతుంది" అన్నాడు నారాయణ.

టక్కున ఆగిపోయాడు రాజు.

"బంగారమా...." అనుమానంగా అన్నాడు.

"అవునురా! వజ్రాలు కూడా. సముద్రంలో అప్పుడప్పుడు ఓడలు మునిగిపోతుంటాయి. వాటిలోని వస్తువులన్నీ బయటకు రావలసిందే. ఏమో నీ అదృష్టం బాగుండి నాలుగు వజ్రాలు దొరికాయనుకో" అన్నాడు నారాయణ.

"య్యా!" అంటూ గాల్లోకి లేచాడు రాజు.

"బంగారం దొరుకుతుందో లేదో గాని ఆస్తిపంజరాలు కూడా కొట్టుకురావచ్చు" అన్నాడు కృష్ణ.

అంతా ఒక్కసారిగా నవ్వారు.

వారలా మాటలు చెప్పుకుంటూ ముందుకు పోతూనే వున్నారు.

ఎక్కడినుండో గాలి దూసుకొస్తోంది. ఆ గాలి శబ్దం సర్రున కోస్తున్నట్లుగా వుంది. సముద్రతీరాలు అందంగా ఉంటాయి. గాలికి ఎగిరిపడే రేణువులు ఇసుకతిన్నెలుగా మారతాయి. వాటి నునుపుదనం చూస్తే మనసెక్కడికో వెళుతుంది. కృష్ణను కదిలించిందవే.

దూరం నుండి చూస్తుంటే ఆ ఇసుకతిన్నెలు పదహారేళ్ళ పడుచుపిల్లలా కనిపిస్తున్నాయి. ఆ ఎత్తుపల్లాలు.... తెల్లటి ఆ తిన్నెల నడుమ ఇనుపరజను పారనల్లగా.... ఎంతో మనోహరంగా ఉందా దృశ్యం.

"నారాయణా! నువ్వెళ్ళి ఆ గుట్టలమీద పడుకొని ఆ అందాల్ని ఆస్వాదిస్తున్నట్లుగా చూస్తుండు. మొత్తం గుట్టల్ని కవర్ చేస్తూ నేనో స్నాప్ తీస్తాను" అన్నాడు కృష్ణ.

నారాయణ వెళ్ళి పడుకున్నాడు.

"కొంచెం ఆ కళ్ళలో ప్రేమని ఎక్స్‌ప్రెస్ చెయ్యరా" అన్నాడు.

నారాయణ కళ్ళు ఆ భావాన్ని నింపుకున్నాయి.

క్లిక్ మంది కెమెరా.

రాజు వాళ్ళు మరో గుట్ట ఎక్కబోతున్నారు.

"ప్లీజ్! ఆ అందాల్ని చెడగొట్టొద్దు" అరిచాడు కృష్ణ.

"తిరిగి ఎంత సేపు. ఆ గాలికి మరలా మామూలే" అన్నాడు ఆనంద్.

"అది కాదురా! నాకు నిలువు లోతున పాతేసినట్లు ఫోటో తీయించుకోవాల నుంది" అన్నాడు రాజు.

"ఓ పని చెయ్యరా....నిన్ను మొత్తం పూడుస్తాం. చెయ్యి మాత్రం బయట పెట్టు" అన్నాడు ఆనంద్.

"ఈలోపు నేను చస్తే? వెధవ ప్రయోగం. నన్ను పూర్తిగా ఇసుకతో కప్పెయ్యండి. నా తల మాత్రం కన పడాలి. నా కళ్ళల్లో మృత్యుభయాన్ని క్లిక్ చెయ్యరా" అన్నాడు.

"సినిమాల కేనున్నా ప్రై చేద్దామనా?" అన్నాడు నారాయణ.

"కాదు, అదో కోరిక అంతే."

రాజు పడుకొన్నాడు. అందరూ కలిసి ఇసుక పొయ్యటం ఆరంభించారు. పది నిముషాల్లో తల తప్పించి అంతా ఇసుక అడుగున కప్పబడింది.

"ఎలా వుందిరా?" అన్నాడు ఆనంద్.

"నా గుండెలమీద బండ పెట్టినట్లుగా" అన్నాడు రాజు.

"మాట్లాడకు ఇసుక జారిపోతుంది."

కృష్ణ కెమెరా నుండి చూశాడు.

రాజు పడుకున్న దృశ్యం బాగుంది.

అతని కళ్ళలో ....

"ఫటాస్టిక్" అన్నాడు కృష్ణ.

కెమెరా క్లిక్ మంది.

కృష్ణ యింకా తేరుకోలేదు అలానే చూస్తూన్నాడు

"ఇంక లెగవరా బాబూ" అన్నారెవరో.

రాజు ఇంకా అలానే పడుకున్నాడు.

ఆనంద్ ఇసుకని ప్రక్కకు నెట్టేశాడు.

"ఏమిటిరా ఏమయింది?" అన్నాడు నారాయణ కదుపుతూ.

"ఎవరో మనల్ని గమనిస్తున్నారు" అన్నాడు రాజు మెల్లగా.

అందరూ ఒక్కసారిగా వెనక్కి తిరిగారు.

అన్నీ ఇసుక తిన్నెలు!

రాజు కళ్ళలో భయం తొంగిచూస్తోంది.

"నీదే ఊహించుకొన్నావో" అన్నాడు ఆనంద్.

నారాయణ పరిగెత్తాడు గుట్టలమీదకి.

ఆనంద్ కూడా అనుసరించాడు.

కృష్ణ బాధగా చూస్తూ ఉండిపోయాడు.

వారి పాదాల తాకిడికి ఆ గుట్టలన్నీ అందం కోల్పోయాయి.

నాలుగయిదు గుట్టలు చూశాక తిరిగొచ్చారు.

"నీ దంతా భ్రమ! యెవరూ లేరు" అన్నారు.

"లేదురా నల్లటి కళ్ళు రెండు కన్పించాయి" అంటూ ఆగిపోయాడు.

"మనిషిని పూర్తిగా చూశావా?"

"లేదు, గుట్టక్రింద నుండి చూశారు. ఆ కళ్ళు వికృ

తంగా మెరిశాయి."

"పిడ్ని గొంతునిండా కప్పేసరికి నిజంగానే మృత్యుదేవత కనిపించి వుంటుంది. లేకపోతే మనం అన్ని గుట్ట లెక్కాం. ఏమన్నా కనిపించిందా?" అన్నాడు నారాయణ.

"అంతే అయుంటుంది. వాడు మెంటల్ గా ఆ క్షణంలో ఆ ఫీలింగ్ లోకి జారిపోయాడు" అన్నాడు ఆనంద్.

"నారాయణా.... రాజుది అనుమానమో, వాస్తవమో తెలియాలంటే నువ్విలా పరిగెత్తకూడదు" అన్నాడు కృష్ణ.

"ఎందుకని?"

"ఓ వేళ యెవరివైనా అడుగుజాడలు పడ్డా అవి చెరిగిపోతాయి కదా!" అన్నాడు కృష్ణ.

"నిజమే" నాలిక్కరుచుకున్నాడు నారాయణ.

"ఇంతకూ యేమైవుంటుందంటావ్?"

"ఏ జంతువో అయివుంటుంది" అన్నాడు కృష్ణ.

"కరెక్ట్! వాటికళ్ళే మెరుస్తుంటాయి" ఆనంద్ అంగీకరించాడు.

"ఆకలవుతుంది" అన్నాడు.

అందరూ కలిసి బిస్కట్స్ తిన్నారు.

డ్రింక్స్ తాగారు.

తిరిగి అందరూ బయలుదేరారు.

సడెన్ గా ఆగిపోయారు.

5

కొంచెం దూరంలో యెవరో వ్యక్తి పడున్నాడు.

ఓ అల అతనిమీద నుండి వెళ్ళింది.

నీరంతా వెనక్కి వెళ్ళిపోంది.

అతనలాగే పడుకున్నాడు.

"చచ్చాడా.... బతికాడా.... హారియప్" కృష్ణ పరిగెత్తాడు.

అందరూ అనుసరించారు.

వెల్లకిలా పడున్న ఆ వ్యక్తికేసి చూశారు.

ముఖంమీద సముద్రపు నురుగు కనిపిస్తూంది.

ముఖం బాగా ఉబ్బివుంది.

శరీరంమీద గాయాల్లాంటివేం కన్పించటంలేదు.

దగ్గరగా వెళ్ళబోయాడు నారాయణ.

"డోంట్ మూవ్" హెచ్చరించాడు కృష్ణ "అతను చచ్చిపోయాడు. నువ్వు చెయ్యివేస్తే వేలిముద్రలు పడతాయి" అంటూ కెమెరా సరిచేసుకొని రెండు కోణాల నుండి ఫోటోలు తీశాడు.

"ఎలా చచ్చిపోయాడంటావ్?"

"ఏమో! గురుడు మందుకొట్టి పోయుంటాడు" అన్నాడు ఆనంద్ శవంవంక చూస్తూ.

"ముందీ వార్త గూడెంవారికి తెలియచెయ్యాలి" అన్నాడు కృష్ణ.

"పదండి పోదాం" అన్నాడు రాజా.

అతని కెందుకో ఈ ట్రిప్ అంత బాగున్నట్లుగా అనిపించటంలేదు. ఏదో జరగబోతూందని అతని మనసు హెచ్చరిస్తూంది.

"ఎవరన్నా యిక్కడ వుందామా....?" అన్నాడు కృష్ణ

"ఎందుకు?"

"మనం వచ్చేలోపు ఈ శవం తిరిగి సముద్రంలోకి

కొ ఉండేమో!”

“ఎవరన్నా ఉండిమాత్రం ఏం చేస్తారు? నువ్వేటూ శవాన్ని పట్టుకో వద్దంటున్నావు” అన్నాడు నారాయణ.

“ఇంకొంచెం పొద్దుకి పెట్టాలి. అప్పుడు నీళ్ళలోకి పోయేదేం వుండదు” అన్నాడు కృష్ణ.

“ఏమీ పట్టొద్దు. అందరం కలిసి వారికి చెబుదాం. అతనెవరో యేమిటో వాళ్ళే చూసుకుంటారు. ఈ లోపల నీళ్ళలోకి పోయేదేం ఉండదు. పెద్ద అలలు కూడా రావటంలేదు” అన్నాడు ఆనంద్.

అందరూ ఆ నిర్ణయాని కొచ్చారు.

కృష్ణ కెమెరాని తన బాగ్ లో సర్దాడు.

అంతా చకచక నడుచుకుంటూ గుడిసెల దగ్గర కొచ్చారు.

అప్పటికి ఇంకా జనం లేరు.

గుడిసెల్లో కొందరు ఆడవాళ్ళు వంట చేసుకుంటు న్నారు.

ఎవరో ఇద్దరు మొగాళ్ళు కనిపించారు.

“ఇదిగో బాబూ” పిలిచాడు కృష్ణ.

వాళ్ళు దగ్గరకొచ్చారు.

“అక్కడ యెవరో చచ్చిపోయారు. మీలో యెవ రైనా అయివుంటారేమోనని చెప్పిపోవాలని వచ్చాం” అన్నాడు.

వారి కళ్ళలో భయం తొంగిచూసింది.

ఏం మాట్లాడకుండా వెనక్కి పరిగెత్తారు.

క్షణాల్లో మరికొందరు పోగయ్యారు.

“ఏడనయ్యా” అన్నాడో పెద్దాయన.

అందరూ కలిసి ముందుకెళ్ళారు.

ఇసుకతిన్నెలు దాటి ముందుకెళ్ళారు.

సముద్రతీరం తప్పితే యేమీ కన్పించటంలేదు.

"ఏదయ్యా?" అన్నాడు తిరిగి.

కృష్ణకు ఆ ప్రాంతం బాగా గుర్తు.

"ఇక్కడే.... ఇక్కడే ఉండటం చూశాం" అని చూపించాడు.

అక్కడ శవం లేదు.... అది పడున్న జాడ సైతం లేదు.

సముద్రతీరంలో గుర్తులు చెదిరిపోతుంటాయి!

"ఏమైపోయింది" అన్నాడు ఆనంద్.

"ఓ వేళ తిరిగి లోపలకు వెళ్ళిపోయిందేమో" అన్నాడు రాజు.

"అందుకే కొంచెం వొడ్డుకు లాగుదామంది" అన్నాడు కృష్ణ.

"భలేవాడివే. అతనెలా చనిపోయాడో మనకేం తెలుసు. మన చేతుల్లో ఎలా పెట్టడం?"

"చూడండి. మేం ఇక్కడ ఓ శవం చూశాం. అతని మొఖం బాగా ఉబ్బివుంది. మాకయితే బాగా తాగున్న మనిషిలా కన్పించాడు. ఆ మైకంలో నే నీళ్ళలో పడి పోయుంటాడు."

అక్కడకు వచ్చినవారంతా ఒకరి మొఖాలు ఒకరు చూసుకొన్నారు.

ఎవరూ యేం మాట్లాడలేదు.

"ఇంతకూ శవం తిరిగి సముద్రంలోకి పోయే అవకాశం వుందంటారా?" అన్నాడు కృష్ణ.

పెద్దాయన తలూపాడు.

“వో త్తుంటయితే బాబు. మీరు కంగారడ్డాయు” అన్నాడు.

మిగతావాళ్ళేం మాట్లాడలేదు.

రాజు యేదో చెప్పబోయాడు.

కృష్ణ కళ్ళతోనే వారించాడు.

“మీ మనిషేమో చెప్పాలని వచ్చాం. సరే ఇప్పుడా సమస్య లేదు. మేం కొంచెం సేపు సముద్రం చూసి వెళ్తాం” అన్నాడు కృష్ణ.

వాళ్ళు మాట్లాడకుండా వెనక్కి తిరిగారు.

“ఏమయిపోయింది శవం?” టెన్షన్ ఆపుకోలేక మెల్లగా అన్నాడు నారాయణ.

“సమ్థింగ్ రాంగ్. ఏదో జరుగుతూంది. వాళ్ళంతా యేమన్నా మాట్లాడారేమో చూడు. వాళ్ళని వెళ్ళనివ్వండి మనం జాగ్రత్తగా గమనిద్దాం” అన్నాడు.

కొంచెం సేపు గవ్వలు యేరారు.

వారంతా కనుమరుగయ్యాక పిలిచాడు కృష్ణ.

శవం పడున్న చోటు వెతికారు.

ఆ చుట్టుపక్కల ప్రాంతిలో ఎవరివో కాలిముద్రలున్నాయి.

“మీరు కొంచెం అడ్డం నిలబడండి” అన్నాడు.

అందరూ నిలబడ్డారు.

కృష్ణ తన బ్యాగ్ నుండి కెమెరా తీసి వాటిని ఫోటో తీశాడు.

అవలా గుట్టల వెనకాలకు కెళ్ళిపోయాయి.

“నా అనుమానం ఏమిటంటే రాజు ఎవరినో చూశాననటం నిజమే అయింటుంది. ఓ మనిషి చచ్చిపోయాడంటే వారిలో అదుర్దా కనిపించిందేమో చూడు

అన్నాడు నారాయణ.

"ఇంకా నయం. మనం ఆ శవాన్ని ఫోటో తీసేమనే సంగతి నోరు జారుతారేమోనని భయపడ్డాను. అనుమానం లేదు. ఆ శవాన్ని యెవరో మాయం చేశారు. నా కెందుకో అనుమానంగా వుంది. ఏదో కుట్ర జరుగుతోంది. అది మాత్రం ఖాయం. అదెందుకో తెలుసుకోవాలి. మనం ఇలా ప్రొసీడ్ అయ్యేకంటే పోలీసుల సహకారం తీసుకుంటే బాగుంటుంది" అన్నాడు కృష్ణ.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు రాజా.

"ఏం లేదు. వెంటనే వెళ్ళిపోదాం. ఆ శవాన్ని ఏ గుట్టల క్రిందో కప్పేసి వుంటారు. వాటన్నింటినీ మనం వెతకలేం. పైపెచ్చు మనమీద దాడి జరిగినా ఆశ్చర్యం లేదు. ముందు సిటీకెళ్ళి ఈ గిల్ ఎక్స్‌పోజ్ చెయ్యాలి. ఆ తర్వాత పోలీసుల్ని కలవాలి."

"ఎందుకురా లేనిపోని తలనొప్పి...." అన్నాడు రాజా.

"భలేవాడివే. ఓ మనిషిని నిలువునా హత్య చేస్తే చూస్తూ ఊరుకొంటామా? ఇలా పిరికిగా ఉండబట్టే ఈ దేశం ఇలా వుంది" అన్నాడు కృష్ణ.

"నువ్వేం భయపడకురా" అన్నారు మిగతా ఇద్దరు.

అందరూ వెనక్కి తిరిగి బయలుదేరారు. రాకాసి చేప అలానే పడుంది. దానివంక చూస్తున్నారు కొద్దిమంది.

స్కూటర్లు స్టార్టు చేసుకొని బయలుదేరారు.

కృష్ణ మొఖం సీరియస్‌గా ఉంది.

వారు వెళ్తుంటే ఎదురుగా వస్తుందో కారు.

"నెంబర్ నోట్ చేసుకో" అన్నాడు కృష్ణ.

అది వేగంగా దూసుకుపోయింది.

"వీలు కాలేదురా" పెదవి విరుస్తూ అన్నాడు ఆనంద్.

"ఫర్వాలేదులే" అన్నాడు కృష్ణ.

ఆ కారుకు నల్లటి తెరలు వ్రేలాడుతున్నాయి.

6

రెండుగంటల తర్వాత పోలీస్ స్టేషన్‌లో వున్నారు.

సి. ఐ రవి తన ముందున్న ఫోటోలు పరిశీలిస్తున్నాడు.

"అదీ సార్ జరిగింది. అది హత్యా, ప్రమాదవశాత్తూ జరిగిందా అనేది తెలవదు. కానీ ఆ శవంలో ఏదో మిస్టరీ వుంది. మరో విషయం. మేం వచ్చేముందు ఓ నల్లటి కారు వెళ్ళింది."

"వాళ్ళు కూడా చేపను చూడాలని వెళ్ళారేమో."

"కావచ్చు. కానీ మా కెందుకో అనుమానంగా వుంది."

"మీ కెందుకంతగా అనుమానపడుతున్నారు?"

"నాకు టెక్నికల్‌గా పూర్తి వివరాలు తెలియవు. ఈ తిమింగలాల నుండి "అంబర్" అనే విలువయిన పదార్థం లభిస్తుంటుంది. దానికి విపరీతమైన డిమాండు. కిలోనే లక్షల్లో పలుకుతుంటుంది. ఆ నడుమ ఎక్కడో ఇలాంటి వార్తనే విన్నాను సార్! ఎవరో వల్లో ఇలాంటి అరుదైన పదార్థం దొరికింది. దాన్ని కారుచౌకగా కొని విదేశాలకు పంపించారు."

రవి తల పంకించాడు.

"ఇంట్రెస్టింగ్!"

"దానికున్న విలువ వారికి తెలియదు. ఇలాంటి సమయాల్లోనే స్మగ్లర్స్ బయలుదేరుతుంటారు. వాటాలు

కంగారులో, మరో కారణంతోనో అవి పేపర్లోకి వచ్చే ముందే విశేషాలను చేరిపోతాయి."

"నిజమే" అన్నాడు రవి.

"అందుకే మేం ఈ విషయాన్ని ఈజీగా తీసుకున్నట్లు నటించాం. మీరు వెంటనే రంగంలోకి దిగాలి. నిజంగా అంబర్ కోసమే ఇదంతా జరుగుతుంటే ఆ స్మగ్లింగ్ ని నిరోధించాలి."

"ఎలా?"

"ఏముంది? వెంటనే వెళ్ళి థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే అసలు విషయం బయటపడుతుంది" అన్నాడు రవి తేలిగ్గా.

"మీరేమనుకోనంటే ఓ సలహా. మనకు స్మగ్లర్స్ ముఖ్యం. వారిని రెడ్ హాండెడ్ గా పట్టుకోవాలి. సముద్రం మీద వేట ప్రాణాలతో పని. మీరు ఓ ట్రాప్ తయారు చేయాలి" అన్నాడు కృష్ణ.

సి.ఐ. తల ఊపుతుండిపోయాడు కొంచెంసేపు. కృష్ణ చెప్పింది కూడా వాస్తవమే. ఈ సందర్భంలో ఓ ముఠానే అరెస్టు చేయొచ్చు.

"గుడ్ సజెషన్, నేను ఇప్పుడే వర్క్ ఆరంభిస్తాను" అన్నాడాయన.

"థాంక్యూ సర్! మా పని యింతటితో అయిపోయింది. మేం వెళ్ళిరావచ్చా?"

"మీరు ఊహించినట్లుగా ఈ రాకాసి చేప వెనుక కథ వుంటే అది త్వరలోనే బయటపడుతుంది. ఈ విషయంలో మీరు అభినందనీయులవుతారు" అన్నాడాయన షేక్ హాండిస్తూ.

"మరల కలుసుకుంటాం సర్!"

"తప్పకుండా. అన్నట్లు ఆ ఫొటోస్ ఇవ్వండి."

"తీసుకోండి" అంటూ అందించాడు.

అందరూ ఆయనదగ్గర శెలవు తీసుకున్నారు. రవి ఫొటోలకేసి చూశాడు.

రాకాసి చేప భయంకరంగా వుంది!

ఆయన గతంలో ఎక్కడో సగం చేప, సగం మానవాకారం వున్న ఫోటోను చూశాడు.

ఈ కేసు సంగతేలా వున్నా ముందా చేపను చూడాలనుకున్నాడు.

వెంటనే ఆయన మనసులో ఓ ఆలోచన రూపు దాల్చటం ఆరంభించింది.

7

ఇన్‌స్పెక్టర్ రవి తన బృందంతో అక్కడికి వెళ్లాడు. అందరూ మఫ్టీలో వున్నారు. అప్పటికే అది మధ్యలోకి కోయబడివుంది. అయినా ఆ రాకాసి చేప తన గాంభీర్యాన్ని కోల్పోలేదు. రవి యిచ్చిన సూచనల ప్రకారం అక్కడ జనాన్ని ఆ పరిసర ప్రాంతాన్ని ఓ కంట పరిశీలించటం ప్రారంభించారు.

ఆ ప్రాంతాల్లో కొంతమంది జాలరులు సైతం కన్పించారు. రవి ఓ జాలరిని కదిలించాడు.

"బాబూ యిక్కడ టీ లాంటిది దొరుకుతుందా?"

"దొరకదండయ్యోగోరు" అన్నాడు.

"పోనీ తింటానికేమైనా దొరుకుతాయా?"

"గూడెంలో సిన్న కొట్టుందయ్యా. ఆయి తింటారో, తినరో."

"ఫర్వాలేదు. బాగా ఆకలిగా వుంది. కొంచెం తెచ్చి

ఆ కొట్టు చూపిస్తావా?" అన్నాడు రవి.

"పదండయ్యా" అంటూ దారితీసేడు.

"ఎలా వచ్చిందిది బయటికి" దారిలో అడిగాడు.

"మా వోల్లు ఏటాడుతుంటే అగపడిందయ్యా.... వాల్లు యిసిరి లాగేసినారు" అన్నాడతను.

"ఎలాంటి చేపలు ఎక్కువ పడుతుంటాయా."

"ఎప్పుడూ దొరకవండి. ఇట్టాగే...."

"సముద్రంలో మీరేం వేటాడుతుంటారు."

"చేపా, రొయ్యలండి."

"ఎక్కడమ్ముతారు వాటిని."

"ఊడికే వొచ్చి ఎత్తుకెల్తారండయ్య. అయిసులో పెట్టి పంపిత్తారు గదండయ్యా."

"అలాగా" అన్నాడు.

"నీ పేరేంటి."

"పోశిగాడండి"

"మీ గూడెం పెద్ద ఎవరు?"

"యీరయ్యండి."

"ఆయనున్నాడా?"

"ఆయ్"

"ఏమిటిక్కడ ఎవరిదో శవం కొట్టుకొచ్చిందంటున్నారు."

"నాకు తెల్దండి" అప్పటిదాకా ఉత్సాహంగా చెప్పుకపోతున్న పోశిగాడిలో భయం తొంగిచూసింది.

"అది కాదయ్యా. ఏమన్నా తగాదాలు జరిగాయా?"

"లేదండయ్యా"

రవి జేబులో నుండి ఏభై రూపాయల కాయితం తీశాడు.

"తీసుకో"

"దేనికండయ్యాగోరు"

"నువ్వు నేనడిగినవాటికి సర్గా సమాధానం చెప్తే యింకో ఏభై ఇస్తాను."

"మీ రెవరండయ్యా"

"నాకు కొంచెం పనుంది"

"పోలీసాళ్లా బాబూ"

"పిచ్చివాడా పోలీసులు డబ్బులిచ్చి అడగరు. కర్రతోనే అడుగుతారు" అన్నాడు నవ్వుతూ.

"ఏటండయ్యాగోరు" అన్నాడు అప్పటికి ధైర్యం వచ్చి.

"ఈ గూడెంలో ఎవరైనా పోయారా?"

"మీ రెవరికీ సెప్పవని పెమానం సెయ్యండి"

"సరే చేస్తున్నాను. చెప్పు"

"అవునండయ్యా పోలిగాడు పోయాడంటున్నారయ్యా."

"ఎట్లా పోయాడు?"

"ఆడెప్పుడూ తాగుతుంటడయ్యా. గూడెపోళ్లెవరినీ సెక్క సేయడు. ఆడు తాగి అందరినీ బూతులు తిడతాడయ్యా. ఆడు ముత్తె లాటాడయ్యా. ఆ వొక్క సెడ్డ గుణా తప్పితే బంగోరంలాంటోడు."

"అతనెందుకు చచ్చిపోయాడు. ఎవరన్నా చంపారా?"

"లేదండయ్యా, ఆడు బాగా తాగేసి పడవేసుకెళ్లాడంట. నీళ్ళలో పడిపోయాడంటన్నారయ్యా."

"మరా శవాన్ని ఏం చేశారు?

"నాకు తెల్దండయ్యా. ఆ యిసయం వోరూ మాట్లాడ

గూడదని గూడెం అన."

రవి మరో ఏభై కాయితం అందించాడు.

"నిజం చెప్పు"

"ఎందుకండయ్యా ఇయన్నీ" అన్నాడు భయంగా.

"నేను వ్యాపారం చేస్తున్నాను. అది మరో కంటికి తెలియకూడదు. పోలిగాడు నిన్న నా కా రహస్యం చెప్పాడు" అన్నాడు రవి మెల్లగా.

"మీకండయ్యా"

"అవును"

"ఏంటండయ్యా" అన్నాడు కుతూహలంగా.

"అంబర్ గురించి"

పోలిగాడి కళ్ళలో మార్పు వచ్చింది.

"అయ్ బాబోయ్. ఆడప్పుడే సెప్పేశాడా?" అన్నాడు అంతలోనే.

"చెప్పటం కాదు. నాకెలాగైనా అమ్మేటట్లు చేస్తానన్నాడు. మీ గూడెం వాళ్ళకి చెప్పి వుంచు. నేను డబ్బుతో వస్తానన్నాను. ఈలోపే ఎవరో అనుకుంటుంటే వచ్చాను" అన్నాడు రవి.

"అట్టనా" అన్నాడు పోలిగాడు.

"అవును. మరి చెప్పు"

"యీరయ్యతో మాటాడుకోండయ్యా."

"సరే తీసుకెళ్ళు" అన్నాడు రవి.

జేబులో వందరూపాయలున్నాయన్న ఉత్సాహం కల్లు ముంతల్ని గుర్తుకు తెస్తున్నాయి. ఎంతసేపూ ఈయన్నెలా వదిలించుకోవాలా అనే ఆలోచనలో వున్నాడు పోలిగాడు. త్వరత్వరగా వెళ్ళి వీరయ్యను కలుసుకొని ఏదో చెప్పాడు.

"వత్తానండయ్యగోరూ" అంటూ వెళ్ళిపోయాడు.

"ఏం కావాలయ్యా" అన్నాడు వీరయ్య.

"మనం కొంచెం ఒంటరిగా మాట్లాడాలి"

వీరయ్య అనుమానంగా చూశాడు.

"వ్యవహారాలు నలుగురిలో మాట్లాడటం బాగుండదు"

అతడు మాట్లాడకుండా ముందుకు నడిచాడు. ఇద్దరూ కొంచెం దూరం వెళ్ళి కూర్చున్నారు.

"నాకో విషయం పోలిగాడు చెప్పాడు" అన్నాడు రవి.

"పోలిగాడెవడు.... పోశిగాడా?" అన్నాడు వీరయ్య తొణక్కుండా.

"పోశిగాడు కాదు, పోలిగాడు" కంఠం వత్తి పలికింది.

"ఆదెవడూ లేడే"

"అవును. ఇప్పుడు లేడు. బూడిదగా మారాడో.... ఇసుక గుట్టల క్రింద వున్నాడో" కొంచెం కటువుగా అన్నాడు.

"ఓరు మీరు" కంగారుగా అన్నాడు.

రవి జేబులో నుండి ఫోటో తీశాడు.

"ఇతనెవరో మీకు తెలుసా?"

వీరయ్య కొయ్యబారిపోయాడు.

"కంగారుపడకు. నేను పోలీసువాడ్ని కాదు. వ్యాపారస్థుడ్ని. నాకు అంబర్ గురించి పోలిగాడు చెప్పాడు. ఉందా? అయిపోయిందా?"

"ఆడు తాగుబోతు ఎదవ. ఎర్రికబుర్లు"

"చూడు వీరయ్యా. ఎర్రికబుర్లు పోలిగాడివి కాదు, నీవి. అడివి ఎర్రికబుర్లయితే బతికే వుండేవాడు. వాడు

నిజం చెబుతాడు కాబట్టే ఎందుకూ కాకుండా పోయాడు. నిన్న తిమింగలంతో పాటు అంబర్ కూడా దొరికింది. అది అమ్మటంలో మీరు వాదులాడుకున్నారు.

“ఈ విషయం పోలిగాడికి తెలిసింది. వాడీ విషయం తాగాక అల్లరి చేస్తాడని, ఈ సంగతి బయటకు పొక్కుతుందనీ మీకు తెలుసు. అందుకే ఎవరో వాడిని బాగా తాగించారు. వాడిని స్పృహలేని స్థితిలో సముద్రంలోకి నెట్టేశారు. అడు చచ్చిపోయాడు. ఆ శవం బయటకు కొట్టుకొచ్చింది. తిమింగలాన్ని చూడటానికొచ్చిన కుర్రాళ్ళు ఆ శవం చూశారు. మీతో ఆ విషయం చెప్పటానికి రాగానే ఈలోపు మాయం చేశారు. ఈ విషయంలో మీరెవరూ నోరెత్తలేరు. కారణం ఆ రహస్యం బయట పడుతుంది. ఎవరి వాటాలు వారికందుతాయని ఎవరూ మాట్లాడలేదు.

కానీ మీకు తెలియని విశేషం మరొకటుంది. ఆ కుర్రాళ్ళు మీ దగ్గర కొచ్చేముందు ఆ శవాన్ని ఫోటో తీశారు. తర్వాత శవం తీసుకువెళ్ళిన వారి అడుగుజాడలు తీశారు. మీకా విషయం తెలియదు. ఇప్పుడు చెప్పా. ఎవరివి వ్రేలికలుర్లు. ఈ విషయం నేను పోలీసులకు చెబితే ఏమవుతుంది. మీ గూడెం వాళ్ళందరినీ అరెస్టు చేస్తారు.”

వీరయ్య నిలువెల్లా వణికిపోతున్నాడు.

“మీకు దాని విలువ తెలియదు. వాళ్ళింతిస్తే అంతకు అమ్ముకుంటారు. అదే మీ దగ్గరున్న అంబర్ కు నేను లక్షరూపాయలిస్తాను. అంటే “వందవేలు” అర్థమవుతుందా?” అన్నాడు రవి.

ఈసారి ఆశ్చర్యంతో మాటరాలేదు వీరయ్యకి.

"నేను చెప్పేది నిజం. దాని కలాంటి విలువ వుంది. నువ్వు సరేనంటే చాలు, నేను ఆ ఏర్పాట్లు చేస్తాను. డబ్బు తెప్పిస్తాను. వెంటనే చెప్పు. అదుందా? అమ్మేసారా?"

వీరయ్య అప్పటికీ అనుమానంగా చూస్తున్నాడు.

"నీకేదో అనుమానంలా వుంది. ఇదుగో అడ్వాన్స్" జేబులో నుండి వందరూపాయల కట్ట బయటకు తీశాడు.

"పది వేలు. నువ్వు మాటిస్తే మిగతావి ఏర్పాటు చేస్తాను."

"కానీ బేరమయిపోయింది గదయ్యా" అన్నాడు వీరయ్య.

"అప్పుడే అయిపోయిందా?" నీరసంగా అన్నాడు.

"అవునండయ్యా పాతిక వేలిత్తమన్నరు. మేం ఏభై అన్నాం. నలభై అన్నరు. మేం వూ అనలే. మల్లా వొత్త మంటూ ఎల్లారు. గోదెపోల్లందరికీ కల్లు పోయించుండ్రు" అన్నాడు వీరయ్య.

రవి కొంతవరకు సంతోషించాడు. మొత్తంమీద పట్టుదలతో నిలబడ్డారు. ఆ కొనేవారు వీరి అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకొని చౌకగా కొంటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంలో పెద్ద హస్తాలున్నా....దళారులే బేరాలు సాగిస్తుండవచ్చు. వారి సలహాకోసం వెళ్ళివుంటారేమో....!

"ఇంతకూ సరుకెక్కడుంది"

"అది చెప్పకూడదు. గూడెంమీద ఆన"

"సరే నా బేరానికి అంగీకరించినట్లేనా?"

"గొడవలవుతాయేమో నయ్యాగారు"

"నీకు భయంలేదు. మేమున్నాం. మాకు బలగముంది.

ఎలాంటి వాళ్ళొచ్చినా కాల్చి అవతల పారేస్తాం"
అన్నాడు రవి.

"సర్లె డయ్యా మాకే ఇష్టం" అన్నాడు వీరయ్య ఎట్టకేలకు.

"అయితే మా వాళ్ళకు డబ్బు తెమ్మని కబురు చేస్తాను."

"ఎళ్ళొస్తవా" అన్నాడు వీరయ్య.

"అవసరం లేదు. వాళ్ళే వస్తారు" అంటూ జేబులో నుండి పాకెట్ రేడియోలాంటి సాధనం తీసి.

"రవి హియర్ ....రవి హియర్ ....ఓవర్" అన్నాడు!

అటునుండి సమాధానం వచ్చింది.

"బేరం కుదిరింది. వెంటనే డబ్బుతో రండి. ఓవర్"

....

"మామూలుగానే రండి. విత్ అమ్యూనిషన్ .... ఓవర్"

తిరిగి సాధనం లోపలకు పెట్టేశాడు.

"ఏంటండయ్యా అది" అన్నాడు వీరయ్య అర్థం కాక.

"మా మనుషులికి ఫోన్ చేశాను" అన్నాడు రవి.

8

అంబర్ అనేది అరుదుగా లభించే పదార్థం. దీని విలువ అపారం. ఒక కిలో నే లక్షల్లో పలుకుతుంది. ఈ విషయం పల్లెకార్లకు తెలియదు. తెలిసినా మరో కంటికి తెలియకుండా సొమ్ము చేసుకునే విధానం అంత కంటే తెలియదు. దీనినే 'అంబరం' 'చేప పియ్య' అని కూడా పిలుస్తుంటారు. రాకాసి చేపలు తీసుకునే ఆహారంలో మిగిలిపోయిన పదార్థం అంతా గుండె ప్రక్కకు

చేరుతుందట. అదే ఈ అమూల్యమైన పదార్థంగా రూపొందుతుంది. ఈ పదార్థాన్ని ఓ ప్రత్యేక సమయంలో అవి కక్కేస్తుంటాయి. ఆ పదార్థం వేటగాళ్ళ వలలోకి చిక్కుకోవటంగాని, లేక మామూలుగా సముద్రం బయటకు విసిరేసిన వస్తువుల్లా ఒడ్డుకు రావటంగాని జరుగుతుంది.

ఆరేబియా సముద్రంలో ఈ రాకాసి చేపలు ఎక్కువగా సంచరిస్తుంటాయంటారు. అందుకే ఆ ప్రాంతాల్లో ఈ పదార్థం అప్పుడప్పుడు లభించే అవకాశాలున్నాయి. బంగాళాఖాతంలో మాత్రం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఈ పదార్థం కోసం పల్లెకార్లు చూస్తుంటారు. వారు ఉదయాన్నే లేచి సముద్రతీరంలో వెతుకుతుంటారు.

అంబర్‌ను సుగంధద్రవ్యాల్లో వినియోగిస్తారు. విదేశాల్లో విపరీతమయిన గిరాకీ వుంది. అసలు మన చేపలూ రొయ్యలకే విదేశాల్లో గొప్ప డిమాండ్ వుంది. అంబర్ అరుదుగా లభించినా జాలర్లకు అందుకు లభించేది చాలా తక్కువ. వందల్లోనే అది చేతులు మారిపోతుంటుంది. దాని ఆకారం పేడలా నల్లగా వుంటుందంటారు.

క్షణాల్లో అది ఎక్కడకు చేరాలో అక్కడకు చేరిపోతుంది. అంతా అయిపోయాక ఈ విషయాలు పత్రికల్లో వస్తుంటాయి. అందుకు ప్రధాన కారణం వాటాలు సరిగ్గా కుదరకపోవటం. రెండోది వారి బలహీనతలమీద ఆడుకోవటం. వారికి తమ పొరపాటు గుర్తొచ్చిన క్షణంలో ఈ వార్తలు వెల్లడయ్యేవి.

జాలర్ల జీవితమే విచిత్రంగా వుంటుంది. వారికి ఎంత డబ్బు యిచ్చారనేది సమస్య కాదు. వారికి తగినంత కల్లు గానీ సారాయి గాని పోయిస్తే వారిపట్ల యెంతో నమ్మ

కంగా వుంటారు.

సోమవారంనాడు వేటకు బయలుదేరుతారు శని వారం సాయంకాలానికి తిరిగివస్తారు. నడుమ ఉండేది ఒక్క ఆదివారం. ఆ రోజే తాగినా, నిండుగా బట్ట కట్టినా! ఆ వారంరోజుల వేటమీద వచ్చిన డబ్బులు తాగటానికి, బట్టలకి, తిరిగి తిండికి సరిపోతాయి. ఒక్కో సారి అప్పులు....

తిరిగి తొలిపొద్దుతోనే సముద్రంలోకి ప్రయాణం వలలు.... చేపలు రొయ్యలు....గోచీ గుడ్డ కాల్చిన ఎండు చేప....సముద్రం నుండి వారు వెలికితీసే సంపద వారినుండి చేతులు మారి మారి విదేశాలకు చేరేనాటికి దాని విలువ వారికిచ్చే విలువకు అనేక రెట్లు....

9

వీరయ్య గుడిసెదగ్గర కొచ్చారిద్దరు వ్యక్తులు.

"వీరయ్యా!" పిలిచారు.

"వొస్తన్నా!"

బయటకొచ్చి చూశాడు.

"ఏటండి."

"ఏటండేంటి? నువ్వడిగినట్లుగానే ఏభై వేలు తెచ్చాం. సరుకు తీసుకురా. త్వరగా."

"పైసలెయ్యి"

"ముందు సరుకు తీసుకురా. అయ్యగారు కార్లో కూర్చొన్నారు."

"అది లక్షరూపాయలిక్క వోగేసినానండి!"

ఒక్కక్షణం నిర్ఘాంతపోయారు.

"లక్షరూపాయలా?"

"అయ్యా!"

"ఎవరికి?" తేరుకున్నాక అడిగాడు.

"కి.శో మీ అనుమంటారే."

"సరుకి చేర్చావా?"

"లేదు. పైసలు తెచ్చేదుండాది...." అన్నాడు వీరయ్య.

వారిలో ఒకతను పైకి చేశాడు.

"సర్లే ఎప్పుడే వస్తాం" అంటూ వెనక్కి తిరిగాడు.

"వీడు చెప్పేది ఎంతవరకు నిజం. సరుకు నిజంగా అమ్మేశాడంటావా?"

"అనుమానమే. అయినా వేరే పార్టీ రావటానికి అవకాశం వుంది."

"ఎవరయినా రావొచ్చు. ముందు సరుకు మాయం కాలేదు. అది నయం."

"అందుకే మనవాళ్ళని యిక్కడ వుంచమని చెప్పాను.

"చెప్పావనుకో. వాళ్ళిక్కడ తిరుగుతుంటే లేనిపోని అనుమానాలు వస్తాయి."

"వాడు నాటకం వేస్తున్నాడేమో ననుకుంటా. ఎవడూ వచ్చుండడు. అసలు ఏభై వేలంటేనే గుండె పగిలిపోతుంది. కొడుకులికి కల్లు పోయిస్తే పారేసేవారు. తెలివి మీరిపోయారు. నాకు తెలిసినంతవరకూ ఇంత ధర ఎప్పుడూ పలకలేదు."

"మరి వాడెవడో అడుక్కుంటానంటాడు."

"ముందు గురువుగార్కి చెబితే యేం చేయాలో ఆయనే చెబుతాడు."

"ఇద్దరూ కారు దగ్గర కెళ్ళారు.

వెనక సీట్లో ఓ పెద్దమనిషి కూర్చుని పేపర్ చదువు

కొంటున్నాడు. ఆయన ఖద్దరు పంచె, లాల్చీ ధరించాడు. వ్రేళ్ళకు ఉంగరాలు మెరుస్తున్నాయి. వాళ్ళని చూడగానే—

"ఏమిటి రెడీనా" అన్నాడు.

"వాడు పేచీ పెడుతున్నాడు సార్!" అన్నాడొకతను.

"పేచినా? దేనికంట?"

"లక్షరూపాయల కెవరో కొంటారన్నారట."

"ఆ దెవడు?"

"ఏమోనండి!"

"సరుకుందా లేదా?"

"ఉంది సార్!"

ఆయన కొంచెం రిలీఫ్ ఫీలయ్యాడు.

"ఏం చేద్దామంటారు?"

"ముందు వాడ్నిక్కడికి పిలుచుకు రండి" కంగున మ్రోగింది ఆయన కంఠం.

"అలాగే!"

ఇద్దరూ వెనక్కి వెళ్ళారు, వీరయ్య వారితో పాటు వచ్చాడు.

కారులో వున్న వ్యక్తిని చూడగానే—

"దండాలండయ్యా" చేతులెత్తి నమస్కరించాడు.

"ఈ దండాలదేముంది. మాకు దండం పెట్టబోక" వ్యంగ్యంగా అన్నాడు.

"ఏటండయ్యా"

"అవునయ్యా, నువ్వే ఏదో అని చెప్పావు. సరే మేం వెళ్ళి డబ్బు తెస్తామంటూ నా మనుషులొచ్చారు. ఈలోపు ఎవరో లక్షకు కొన్నారంటున్నావు. ఇదేంటి

వ్యాపారమా? తల్లకాడా?" అన్నాడు కోపంగా.

"సగం కోసేసి వాయి కదండె."

"నువ్వడిగిందెంత? ఏభై. మేం నలభై అన్నాం. నువ్వు కాదన్నావ్, సర్లే డబ్బు తెస్తాగన్నాం. ఈలోపు ఎవడో దొంగమాటలు చెబితే నమ్మటమేనా? ఇంకో పదివేలిస్తాను. సరుకు పట్రా" అన్నాడు.

"ఆయనగోరు పదేలిచ్చిండయ్యా ..... పైసర్దేటా కెళ్ళిండు."

"పదివేలిచ్చాడా? నువ్వెలా తీసుకుంటావయ్యా? నాకు బేరం ఇచ్చినాక నేను కాదంటే అప్పుడు ఇంకో కటికి చెప్పాలి. అదేం కుదరదు. మర్యాదగా చెబుతున్నాను. సరుకు నాకిచ్చావా సరే లేదంటే మొత్తం మీ అందర్నీ జైల్లో తోయిస్తాను."

"దేనికండయ్యా."

"అది మన అబ్బగాడి ముల్లెకాదు లక్షలకమ్మకు దొబ్బటానికి. గవర్నమెంటుకు చేరాలి. నీకు మంచిగా చెబుతున్నా. దురాశ మంచిదికాదు. ఆ సరుకు ఇక్కడి నుండి తీసుకెళ్ళటం.... పైకి పంపించటం...ఇదేమన్నా ఆషామాషి వ్యవహారమనుకున్నావా? నువ్వు ఎక్కువసేపు ఆలోచించావంటే నీ నోట్లో దుమ్మే....చివరిసారిగా చెబుతున్నా ఇంకో పది.... మొత్తం దెబ్భై. డబ్బిదిగో" అంటూ సూట్ కేస్ తెరిచాడు.

అందులో వరసగా పేర్చున్నాయి వందరూపాయల కట్టలు.

అంత డబ్బుచూసి కళ్ళు తేలేసాడు వీరయ్య.

అంతలోనే పోలిగాడి ఫాటో గర్తొచ్చింది.

"మీకు తెల్దండయ్యా. గొడవయిపొద్ది"

"ఏం గొడవవుతుందట" అన్నాడాయన సూట్ కేస్ మూస్తూ.

"పోలిగాడిసయం ఆళ్ళకు ఎరికయినాదండి."

"వాడెవడయ్యా" చిరాగ్గా అన్నాడు.

"ఆయనెవరో తెల్దండి. పోలిగాడి పటం సూపించిండు."

"అది పటం ఏమిటి?"

"అదు పచ్చి వొడ్డున పడున్న పటమయ్యా."

"వాడ్నెవరు తీశారయ్యా" అన్నాడు అర్థంకాక.

"మొన్న సూడెంటు కుర్రాళ్లొచ్చి పత్తిసారం దయ్యా."

"ఏమిటయ్యా ఇది" అన్నాడు తన మనుషుల్ని.

"అదీ... ఆ పోలిగాడు డేంజర్ ఫెలో సార్. వాడు నోరు తెరిస్తే ఈ విషయమంతా గబ్బు గబ్బు. అందుకని వాడికి బాగా తాగించారు. తాగి తాగి పడిపోయాడు. ఇప్పుడే లేవడు కదాని మనవాళ్ళు సముద్రం వొడ్డు కెళ్ళారు. ఈలోపు వాడెప్పుడు లేచాడో, ఎలాపోయాడో సముద్రం వొడ్డున తేలాడు. వాడి శవాన్ని చూసి మన వాళ్ళే అక్కడినుండి తెచ్చేశారు" అన్నాడు.

"అయితే."

"అంతవరకుందే ఆళ్లు పటమెత్తింది."

"తీసుకొని. ఇంతకూ వాడ్నేం చేశారు?"

"దహనం చేయించాం."

"వాడికెవరూ లేరా?"

"నేరండయ్యా .... ఆడమ్మ సిన్నప్పుడే పోయింది. ఆడయ్యా....అన్నలూ ఏటకెళ్ళి కొట్టుకపోయినారు."

"పీడా వదిలింది. ఇందులో నువ్వేం భయపడాల్సిన

అవసరంలేదు. అదెవడో తాగి నీళ్ళలో పడి చచ్చాడు. వాడ్ని దహనంచేశారు దీనికి ఎవడూ ఏం చెయ్యలేదు. మీకేమన్నా జరిగితే నేను లీడర్ ని పెడతా అర్థమయిందా?"

"అయ" అన్నాడు సందేహంగా.

"వాడు నిజంగా డబ్బులిచ్చాడా?"

"ఇచ్చిండయ్యా."

"వాడెవడో మీకు టోకరా ఇవ్వటానికి చేశాడు. సరే ఇంక ఆలశ్యం చెయ్యకు. సరుకు తీసుకురా ముందు."

"మరి గూడెపోళ్ళందరికీ లక్షరూపాయలని సెప్పాం గద అళ్ళంతా నామీద పడతరు."

ఇంక ఆయనలో సహనం నశించిపోయింది.

తన అనుచరులకు సైగచేశాడు.

"నీకు మర్యాదగా చెబితే వినవు" అన్నాడు.

అప్పుడు చూశాడు వీరయ్య.

ఆ ఇద్దరి చేతుల్లో నిగనిగలాడుతున్నాయి రివాల్వర్లు.

"అరిచావా, కుక్కను కాల్చినట్లు కాల్చిపారేస్తాం. మాట్లాడకుండా ముందుకు నడువ్. వెంటనే సరుకు మాకివ్వాలి నిన్నే కాదు. మొత్తం నీ గూడెమంతా బాంబుల్తో ధ్వంసం అవుతుంది. వ్యాపారమంటే పరాచికాలనుకున్నావా?"

డోర్ తెరిచి క్రిందకు దిగాడు.

"పద" అన్నాడు.

వీరయ్యకు భయంతో నోటివెంట మాట రాలేదు.

వీపుకు రివాల్వర్ గుచ్చుకుంటోంది.

మాట్లాడకుండా నడుస్తున్నాడు.

"దారిలో మీవాళ్ళతో యేమన్నా మాట్లాడినా,

సైగ చేసినా, అదే నీ చివరి క్షణం. మర్యాదగా డెబ్బై వేలిస్తామని చెబితే, కథలు చెబుతున్నావు. మిమ్మల్ని తాటతియ్యాలిరా” పళ్ళు పటపట కొరికాడాయన.

వీరయ్య మాట్లాడకుండా సరుకు దాచిన చోటుకెళ్లాడు.

అంబర్ ను చూసేటప్పటికి ఆయన కళ్ళు వికృతంగా మెరిసాయి.

“మీరన్నంతయినా ఇవ్వండయ్యా” వీరయ్య ప్రాధేయపడ్డాడు,

“సామ్మా? నీకు దురాశవద్దురా అని చిలక్కి చెప్పినట్టు చెప్పా. నీకూ తేరగా వచ్చిందేగా. అంత తాపత్రయం దేనికి? నువ్వు మాట్లాడకుండా నడువ్ ... ఒక్క ముక్క మాట్లాడవా....తలకాయ పేలిపోతుంది. ఒక్క బాంబు విసిరే ఈ గూడెం మొత్తం మసి” అన్నాడు క్రూరంగా.

వీరయ్యకు తెరలు తెరలుగా దుఃఖం వచ్చింది.

తమ పరిస్థితి ఇంత అన్యాయం అవుతుందని అతనూహించలేదు.

“బావూ....మా పెళ్లాం బిడ్డల్నేన్నయా చెయ్యకండి” అంటూ కాళ్ళమీద పడ్డాడు.

“ఛీ....ఛీ....లేస్తావా? ఛస్తావా?” ఉరిమాడు.

ప్రాణభయం!

వీరయ్య చటుక్కున లేచాడు.

తిరిగి కారు దగ్గరకు ప్రయాణం ఆరంభమయింది.

కారులోకి వెళ్ళాకకూడా వీరయ్య భయంగా చూస్తుండిపోయాడు.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడో వ్యక్తి.

మరో వ్యక్తి చేతిలో రివాల్వర్‌తో కూర్చున్నాడు.

వీరయ్య భోరున ఏడుస్తున్నాడు.

కారు స్టార్టయింది.

గాల్లో ఎగిరొచ్చిందో కట్ట.

వీరయ్య కాళ్ళముందు పడింది.

గాలికి వందరూపాయలు రెపరెపలాడుతున్నాయి.

వీరయ్య వంగి ఆ కట్ట అందుకున్నాడు.

కారు టర్నింగ్ తీసుకొని ముందు కదిలింది.

అప్పటిదాకా భరించిన ఆవేశం, దుఃఖం, అన్ని భావాలు ఒక్కసారిగా బరస్టయ్యాయి. అప్పటిదాకా ఉన్న ప్రాణభయం కూడా అదృశ్యమైంది.

"రేయ్.... బాడ్కో" పెద్దగా అరుస్తూ.... పరిగెత్తి కళ్ళ చేతిలోని వందకట్ట కారుమీదకు విసిరేడు....

"ధన్"మంటూ తగిలి క్రిందపడింది.

వీరయ్య నోరు తెరిచాడు అరుస్తూ... ఏడుస్తూ.

గూడెంనుండి ఎవరెవరో పరిగెత్తుకొస్తున్నారు.

కారులోనుండి చెయ్యి బయటకొచ్చింది.

రివాల్వర్ ఒక్కసారిగా ఉరిమింది.

బులెట్ దూసుకొచ్చి తొడల్ని రాసుకుంటూ ఇసుకలో దిగబడింది.

వీరయ్యకు నిప్పుతో కాల్చినట్లయింది.

రక్తం....రక్తం....!

కెవ్వున అరిచి పడిపోయాడు.

ఎవరో వీరయ్య తలను తొడమీద పెట్టుకున్నాడు.

దూసుకెళ్తున్న కారు వంక చూస్తున్నారు మిగతా జనం!

10

వేగంగా దూసుకెళ్తున్న కారులో వారికి ఎదురుగా కనిపించిందో దృశ్యం!

రోడ్డుకు అడ్డంగా పోలీస్ వాహనం....కవర్ చేస్తూ పోలీసులు అప్పటికే దగ్గరగా వచ్చారు.

"ఏం చేద్దాం సార్."

"మొత్తం ఎంతమంది ఉంటారు."

"పదిమంది దాకా."

"అలానే వెళ్తే."

"కష్టం సార్."

"షూట్ చెయ్యి. దారిస్తారు."

కారు వేగం తగ్గలేదు.

"ధన్"మంటూ బులెట్ దూసుకుపోయింది.

ఒక్కసారిగా అందరూ చెల్లాచెదురయ్యారు.

రోడ్ జిగి వెళ్ళొచ్చు.

"వాళ్ళ టైరుకు గురిచూడు" సూట్ కేసులోనుండి రివాల్వర్ తీస్తూ అన్నాడు.

కారును చాకచక్యంగా రోడ్డు క్రిందకు తిప్పి, వెంటనే రోడ్డుపైకి టర్న్ చేశాడు.

"ధన్"మంటూ వెనక అద్దం బ్రద్దలయింది.

భళ్ళున అద్దం పెంకులు మీద పడ్డాయి.

మరో బులెట్ ఫ్రంట్ అద్దాన్ని బ్రద్దలు చేసింది.

"హరియవ్" సీటు క్రిందనుండి అరిచాడు.

ఒక్కమాటు కారు పెద్ద కుదుపుతో ఆగిపోయింది.

వెనక రెండు టైర్లూ తూటాల్తో నిండిపోయాయి.

డ్రైవర్ భుజంలో దూరిందో బుల్లెట్.

"మర్యాదగా లొంగిపొండి" పైనుండి వినపడు

తురదో స్వరం.

"ఏం చేద్దాం సర్."

ఆయ నేం మాట్లాడలేదు.

"కాల్చేస్తారేమో?"

రెండు చేతులూ ఎత్తి దిగాడాయన.

మిగతా యిద్దరూ దిగారు.

పోలీసులు వారిని చుట్టుముట్టారు.

సి.ఐ. రవి బేడీలతో ముందుకు నడిచాడు.

"నేనెవర్నో తెలుసా? బేడీలు వేస్తే ఆ తర్వాత విచారిస్తావు" అన్నాడాయన.

ఈడ్చి గుద్దాడు కడుపులో.

"అమ్మా" అంటూ కడుపు పట్టుకు కూర్చున్నాడు.

"వీడ్ని వాన్‌లోకి విసరండి" ఆజ్ఞ ఇచ్చాడు.

వాన్‌లోకి అందర్నీ ఎక్కించాక కదిలింది.

లాకప్ రూం నుండి సి.ఐ. అరగంట తర్వాత బయటకొచ్చాడు.

"యూ ఆర్ వే ఫర్ బిన్" రక్తం తుడుచుకుంటూ గొణుక్కుంటున్నాడా పెద్దమనిషి.

అతని పంచె పీలికలయిపోయింది.

వంటిమీద చొక్కా లేదు.

జుట్టు చిందరవందరగా వుంది.

అచ్చంగా వేటకెళుతున్న జాలరిలా ఉన్నాడు.

ఆ పట్టణంలోని ఓ ప్రముఖ గ్యాంగ్ స్థావరాలమీదకు మరో అరగంటలో దాడిచేయబోతున్నాడు రవి!

* * *

"కంగ్రాట్యులేషన్స్ యంగ్ బాయ్స్. మీలా

యువకులు ముందుకు రావాలి" అన్నాడు కృష్ణ బృందాన్ని అభినందిస్తూ ఇన్‌స్పెక్టర్ రవి.

"ఒక్ థింగ్ సర్. మేం చెప్పింది విని మమ్మల్నే అరెస్ట్ చెయ్యకుండా ప్రొసీడ్ అయినందుకు మీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి" అన్నాడు కృష్ణ.

"ఓ" అంటూ నవ్వేసాడు రవి.

"సర్ ఈ కేసులో పొలిటికల్ ప్రెషర్."

"ఐడోంట్ కేర్" అన్నాడు తేలిగ్గా రవి!

—:అ యి పో యి ం ది:—